అధ్వానంగా విలీన గ్రామాల రోడ్లు

- ఎన్నికల కోడ్‌తో సగంలోనే నిలిచిన పనులు
- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు
- పట్టించుకోని కాంగ్రెస్ ప్రభుత్వం

ఖిలావరంగల్, జూలై 29: గ్రేటర్ వరంగల్ 17వ డివిజన్‌లోని విలీన గ్రామాల్లోని ప్రధాన రహదారులు అధ్వానంగా మారాయి. బీఆర్ఎస్ ప్రభుత్వం విలీన గ్రామాల రోడ్లకు రూ.కోట్లలో నిధులు కేటాయించింది. ఎన్నికల కోడ్ రావడంతో పనులు మధ్యంతరంగా నిలిచిపోయాయి. దీంతో అసంపూర్తి రోడ్లపై ప్రజలు వెళ్లలేక ఇబ్బందులు పడుతున్నారు. గాడిపల్లి గ్రామంలో ప్రధాన రహదారి వెడల్పు చేసి సైడ్ డ్రైనేజీతోపాటు డబుల్ రోడ్డు నిర్మాణం చేపట్టేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.1.50 కోట్లు నిధులు మంజూరు చేసింది. ఈ మేరకు రోడ్డును విస్తరించారు. డ్రైనేజీతోపాటు తారు వేసేందుకు పనులు ప్రారంభించారు. కంకర పోసి చదును చేసిన తర్వాత అసెంబ్లీ ఎన్నికల కోడ్ వచ్చింది. అలాగే, గాడిపల్లి నుంచి కాపులకనుపర్తి మీదుగా బొల్లికుంటకు వెళ్లే రోడ్డుకు రూ.75వేలు, స్తంభంపల్లిలో రోడ్డు విస్తరణకు రూ.1.50 కోట్లు విడుదల చేసింది. ఎన్నికల కోడ్ కారణంగా నిలిచిపోయిన పనులను తర్వాత వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపించారు. కంకర తేలిన రోడ్డుపై ప్రయాణించడం వల్ల కిందపడి గాయాపాలవుతున్నామని స్థానికులు ఆరోపిస్తున్నారు. అధికారులు స్పందించి, విలీన గ్రామాల మధ్య నిలిచిపోయిన రోడ్ల పనులను పూర్తి చేయాలని కోరుతున్నారు.

కంకర తేలి, గుంతలతో అధ్వానంగా ఉన్న గాడిపల్లి గ్రామంలోని ప్రధాన రోడ్డు

సీపీ పేరుతో నకిలీ ఫేస్‌బుక్ అకౌంట్

సుబేదారి, జూలై 29 : సైబర్ నేరగాళ్లు సోషల్‌మీడియాలో వరంగల్ సీపీ పేరుతో ఫేస్‌బుక్‌లో ఫేక్ అకౌంట్ ఓపెన్ చేసి, పలువురికి ఫ్రెండ్ రిక్వెస్ట్‌లు పంపిస్తున్నారు. విషయం తెలుసుకున్న సీపీ అంబర్ కిశోర్ ఝా స్పందించారు. తన పేరుపై నకిలీ ఫేస్‌బుక్ అకౌంట్ నుంచి వస్తున్న ఫ్రెండ్ రిక్వెస్టులకు ఎవరూ స్పందించొద్దని కోరారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

కరీమాబాద్, జూలై 29 : ఖమ్మం హైవేలోని మామునూరు క్రాస్ బస్టాండ్‌లో కొంత కాలంగా నివసిస్తున్న గుర్తు తెలియని వ్యక్తి సోమవారం మృతిచెందాడు. మామునూరు ఎస్సై కృష్ణవేణి సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి ఎంజీఎం మార్చురీకి తరలించారు. అతడి వివరాలు తెలిసిన వారు మామునూరు పోలీసులను సంప్రదించాలని సూచించారు.

కొత్తవాడలో చేనేత కార్మికుడు..

శ్రీనివాస్(ఫైల్)

పోచమ్మమైదాన్, జూలై 29 : వరంగల్ కొత్తవాడకు చెందిన చేనేత కార్మికుడు వన్నాల శ్రీనివాస్(43) సోమవారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతిచెందాడు. పదేళ్లుగా ఆయన కాకతీయ చేనేత సహకార సంఘంలో మగ్గం నేస్తున్నారు. మృతుడికి భార్య, ఇద్దరు ఆడ పిల్లలు ఉన్నారు. ఈ సందర్భంగా టీపీసీసీ చేనేత విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చిప్ప వెంకటేశ్వర్లు ఆయన మృతదేహాన్ని సందర్శించి, కుటుంబ సభ్యులను ఓదార్చారు. బాధితులకు త్రిఫ్ట్ పథకంలో రూ.25వేలు, చేనేత బీమా తరుపున రూ.5లక్షలు అందించేలా మంత్రి కొండా సురేఖ ద్వారా ప్రయత్నం చేస్తానని తెలిపారు.

రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలి

వరంగల్ చౌరస్తా, జూలై 29 : కార్మిక హక్కులను కాపాడుకోవడానికి కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఆగస్టు 4న చార్‌బౌళి పద్మశాలి కల్యాణ మండపంలో నిర్వహించే రాష్ట్ర స్థాయి సదస్సును విజయవంతం చేయాలని తెలంగాణ అసంఘటిత కార్మిక సంఘాల సమాఖ్య ఎంజీఎం విభాగం ప్రతినిధులు నాగరాజు, రాజు కోరారు. ఈ మేరకు సోమవారం సదస్సు కరపత్రాన్ని వారు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంజీఎం దవాఖాన సెక్యూరిటీ, పేషెంట్ కేర్, శానిటేషన్ విభాగాల ప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు.

అంధుల పాఠశాలలో అన్నదానం

పోచమ్మమైదాన్, జూలై 29 : వరంగల్ ఆటోనగర్‌లోని లూయిస్ ఆదర్శ అంధుల పాఠశాలలో యువ నేతాజీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం అన్నదానం నిర్వహించారు. హనుమకొండకు చెందిన వంగ సుజా–ప్రవీణ్‌కుమార్‌రెడ్డి దంపతుల కుమార్తె వామికారెడ్డి పుట్టిన రోజు సందర్భంగా విద్యార్థులందరికీ భోజనం అందించారు. కార్యక్రమంలో చల్లా అరుణ–ఇంద్రసేనారెడ్డి, చల్లా రోజ, రాధమ్మ, ఫౌండేషన్ అధ్యక్షుడు కొత్తకొండ అరుణ్‌కుమార్, కానిస్టేబుళ్లు కన్నె రాజు, బొట్టు కమలాకర్, కోలా రాజేశ్, ఉపాధ్యాయుడు గజ్జెల సుమన్ పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

CHANGE OF NAME
I, RUMANA FATHIMA (New Name), previously called RUMAN FATIMA (Old Name), and residing at H.No. 25-8-441/1, Bapuji Nagar, Kazipet, Hanumakonda Dist.- 506003, T.S., India. and solemnly declare.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552 HANAMKONDA
9182777563
9182777618 WARANAGAL
9182777556 JAYASHANKAR BHUPALPALLY
9182777559 MULUGU
9182777135 JANGAON
9182777565 MAHABUBABAD
9182777557

అంతరాష్ట్ర దొంగ అరెస్టు

దొంగ అరెస్టును చూపుతున్న పోలీసులు

మట్టెవాడ, జూలై 29 : ఉత్తరప్రదేశ్‌కు చెందిన అంతరాష్ట్ర దొంగను మట్టెవాడ పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. యూపీకి చెందిన కృష్ణకాంత్ సక్సేనా గత నెల 22న జయ్ పూర్‌లోని రిలీఫ్ రీలోకేషన్ పార్సిల్ సర్వీస్ ఆఫీసు నుంచి ఓ కారును మహా రాష్ట్ర గోండియాకు డెలివరీ కోసం తీసుకుని జూన్ 20న వరంగల్‌కు వచ్చా డు. జూన్ 24 తెల్లవారుజామున హంటర్‌రోడ్డులోని హోస్వాన్ ఎలక్ట్రికల్ షాపు నుంచి సుమారు రూ.2లక్షల విలువగల ఫినోలెక్స్ ఎలక్ట్రిక్ వైరును దొంగిలించాడు. షాపు యజమాని పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమో దు చేసి, సీసీ కెమెరాలు పరిశీలించి శ్రీకాంత్ సక్సేనాను సోమవారం అరెస్టు చేశారు. అతడి వద్ద నుంచి నేరం చేయడానికి ఉపయోగించిన రెండు కార్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కేసును చేధించడంలో ప్రతిభ కనబర్చిన ఎస్సై నవీన్‌కుమార్, ఐటీ కోర్ టీంను వరంగల్ ఏసీపీ నందిరాంనాయక్, మట్టెవాడ్ ఇన్‌స్పెక్టర్ గోపి అభినందించారు.

విద్యుత్ టవర్ ఎక్కి యువకుడి ఆందోళన

ఆందోళన చేస్తున్న యువకుడు

కాశీబుగ్గ, జూలై 29 : గ్రేటర్ 14వ డివిజన్ ఎస్ఆర్‌నగర్‌కు చెందిన యువకుడు కుదురుపాక జయప్రకాశ్ సోమవారం ఎనుమాములలోని సబ్ స్టేషన్‌కు సంబంధించిన టవర్ ఎక్కి ఆందోళన చేశాడు. వివరాల్లోకి వెళ్లితే.. ఎస్ఆర్‌నగర్‌కు చెందిన కురుదుపాక వెంకటేశ్వర్లు(కేవీ స్వామి), అతడి బంధువులకు మధ్య ఆర్థిక లావాదేవీల గురించి కొన్ని రోజుల నుంచి పెద్దల సమక్షంలో పంచాయితీలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో వెంకటేశ్వర్లు తమ బంధువులకు డబ్బులు ఇవ్వాల్సిందిగా తేలింది. అయినా ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తుండడంతో రంగశాయిపేటకు చెందిన వారు మిల్స్‌కాలనీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో స్టేషన్‌కు రావాలని వెంకటేశ్వర్లును పోలీసులు ఆదేశించగా అతడి కుమారుడు జయప్రకాశ్ ఎనుమాములలోని సబ్ స్టేషన్ పక్కన గల టవర్ ఎక్కి పోలీసులు తన తండ్రిని ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆందోళనకు దిగాడు. వెంటనే ఎనుమాముల సీఐ పులి రమేశ్‌గౌడ్ రంగంలోకి దిగి అతడికి న్యాయం జరిగేలా చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం స్టేషన్‌కు తరలించి కౌన్సెలింగ్ నిర్వహించారు. అలాగే, స్థానిక కాంగ్రెస్ నాయకులు వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు దృష్టికి సమస్యను తీసుకువెళ్లారు.

కుటుంబ సభ్యుల అప్పగింత

కుటుంబ సభ్యులను అప్పగిస్తున్న సీఐ

ఖిలావరంగల్, జూలై 29 : గొడపడి ఇంటి నుంచి వెళ్లిపోయిన ముగ్గురు కుటుంబ సభ్యులను మిల్స్‌కాలనీ పోలీసులు సోమవారం గుర్తించారు. సీఐ మల్లయ్య కథనం ప్రకారం.. ఏకశిలనగర్‌కు చెందిన గోనెల రాజ్‌కుమార్, అతడి తల్లి దండ్రులు లింగమూర్తి, వనమాల ఈ నెల 8న గొడవపడి ఇంటి నుంచి వెళ్లి పోయారు. దీంతో లింగమూర్తి కుమార్తె రావుల అశ్విని ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. దర్యాప్తులో భాగంగా ముగ్గురి ఆచూకీ తెలుసుకొని సోమవారం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన అశ్వినికి వారిని అప్పగించినట్లు సీఐ తెలిపారు.

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు

ఆటోడ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న ఏసీపీ నర్సయ్య

వర్ధన్నపేట, జూలై 29 : ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమిస్తే వాహన డ్రైవర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని వర్ధన్నపేట ఏసీపీ నర్సయ్య హెచ్చరించారు. మండల కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్‌లో సోమవారం ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఆయన వెంట ఎస్సై ప్రవీణ్‌కుమార్, సిబ్బంది ఉన్నారు.

పోలీసుల విస్తృత తనిఖీలు

తనిఖీ చేస్తున్న సీఐ రాజగోపాల్‌గౌడ్

నల్లబెల్లి, జూలై 29 : మావోయిస్టు పార్టీ వారోత్సవాల నేపథ్యంలో రూరల్ సీఐ రాజగోపాల్‌గౌడ్ ఆధ్వర్యంలో మండలంలోని ప్రధాన రహదారిపై విస్తృతంగా వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసులు ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. అనుమానితులను ప్రశ్నించారు. సీఐ మాట్లాడుతూ మండలంలో గుర్తు తెలియని వ్యక్తులు సంచరిస్తే తమకు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఎస్సై ప్రశాంత్‌బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్డీఎఫ్ స్కూల్ పేరెంట్స్ కమిటీ ఎన్నిక

పర్వతగిరి, జూలై 29 : మండలంలోని రోళ్లకల్ ఆర్డీఎఫ్ ఉన్నత పాఠశాలలో సోమవారం విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. పేరెంట్స్ కమిటీ చైర్మన్‌గా కందికట్ల ప్రకాశ్, వైస్ చైర్మన్‌గా కట్ట శ్రీనివాస్, ముఖ్య సలహాదారులుగా వడ్లకొండ మాజీ సర్పంచ్ అమడగాని రాజు యాదవ్ ఎన్నికైనట్లు హెచ్ఎం భాషబోయిన రాములు తెలిపారు. కార్యక్రమంలో పేరెంట్స్ కమిటీ సభ్యులు ఈ రమేశ్, జే బాలరాజు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ప్రధానోపాధ్యాయుడు రాములు

శ్మశానవాటిక ప్రహరీని వెంటనే నిర్మించాలి

కూలిపోయిన గోడను చూపిస్తున్న సదాంత్

గిర్మాజీపేట, జూలై 29 : గ్రేటర్ 29వ డివిజన్ రామన్నపేట మోక్షారామం హిందూ శ్మశానవాటిక ప్రహరీని వెంటనే పునర్నిర్మించాలని డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు కొడకండ్ల సదాంత్, స్థానికులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతేడాది వానాకాలంలో కూలిన ప్రహరీ విషయాన్ని పలుమార్లు అధికారులు, ప్రజాప్రతినిధులకు చెప్పినా పట్టించుకున్న దాఖలాలు లేవన్నారు. ప్రజాపాలన ప్రభుత్వం ప్రజల సంక్షేమానికి ఎంతగా ప్రాధాన్యత ఇస్తుందో అర్థమవుతోందని ఎద్దేవా చేశారు. ప్రహరీ కూలడంతో శ్మశానవాటిక అసాంఘిక కార్యాకలాపాలకు అడ్డాగా మారిందన్నారు. అలాగే, సరైన వసతులు లేకపోవడం వలన ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కాగా, డివిజన్‌లోని పోతనరోడ్– హంటర్‌రోడ్ మధ్యలో రోడ్లపై గుంతలు, వాటర్‌పైపులైన్ లీకేజీల వల్ల రాకపోకలకు అంతరాయంతో పాటు రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని వాపోయారు. డివిజన్‌లో మిషన్‌భగీరథ వాటర్ సరిగా రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. రఘునాథకాలనీలో ఉన్న పెద్దమోరీపై స్లాబ్ నిర్మించి, రాకపోకలకు ఇబ్బంది కలుగకుండా అధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు.

ఆపరేషన్ కోసం ఆటో డ్రైవర్ కష్టాలు

దాతలు ఆదుకోవాలని వేడుకోలు

బాధితుడు సుధాకర్

గిర్మాజీపేట, జూలై 29 : రెక్కాడితేనే డొక్కాడని ఆటోడ్రైవర్‌కు ఆపద వచ్చింది. రామన్నపేటకు చెందిన ఆటోడ్రైవర్ సారధి సుధాకర్‌కు కొద్దిరోజుల క్రితం ఎడమచేతికి ఇన్‌ఫెక్షన్ సోకింది. దీంతో కుటుంబసభ్యులు అతడిని ఎంజీఎం దవాఖానాలో చేర్పించారు. సుధాకర్‌ను పరీక్షించిన వైద్యులు ఎంజీఎంలో దీనికి వైద్యం లేదని ప్రైవేట్ దవాఖానలో ఆపరేషన్ చేయించుకోవాలని సూచించారు. ఆపరేషన్‌కు సుమారు రూ.4.50లక్షల దాకా ఖర్చవుతుందని వైద్యులు తెలపడంతో బాధితుడితో పాటు అతడి కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు. ముగ్గురు ఆడపిల్లలతో కుటుంబ భారాన్ని మోస్తున్న సుధాకర్‌కు ఆపరేషన్ ఖర్చు మూలిగే నక్కపై తాటిపండు పడినట్లయింది. ఎవరైనా దాతలు ముందుకొచ్చి సాయం అందించాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు. వివరాలకు 91002 55841 ఫోన్‌నంబర్‌లో సంప్రదించాలని చేతులెత్తి వేడుకుంటున్నారు.

సినారె జయంతి వేడుకలు

చెన్నారావుపేట, జూలై 29 : సింగిరెడ్డి నారాయణరెడ్డి 93వ జయంతి వేడుకలను మండలంలోని కస్తూర్బా గాంధీ పాఠశాలలో సోమవారం ఘనంగా నిర్వహించారు. సినారె చిత్ర పటానికి నివాళులర్పించారు. విద్యార్థులకు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి, బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రత్యేక అధికారి జ్యోతి, ఉపాధ్యాయులు తేజస్విని, దేవిక, కమల, విద్యార్థినులు పాల్గొన్నారు.

కాలనీవాసులు కలిసి ఉండాలి

కరీమాబాద్, జూలై 29 : కాలనీవాసులు కలిసిమెలిసి ఉండాలని రంగశాయిపేట కాలనీల డెవలప్‌మెంట్ కమిటీ అధ్యక్షుడు కర్నె రవీందర్ అన్నారు. సోమవారం 43వ డివిజన్‌లోని గణేశ్‌నగర్ కాలనీ శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయంలో రావి, వేప, బిల్వపత్రం మొక్కలను నాటారు. ఈ సందర్భంగా రవీందర్ మాట్లాడుతూ ఆలయ అభివృద్ధి మనందరి బాధ్యత అన్నారు. కార్యక్రమంలో గణేశ్‌నగర్ కాలనీ అధ్యక్షుడు విజయ్‌సింగ్, ఆలయ అధ్యక్షుడు నెల్లూరి శ్రీనివాస్, కాలనీ వాసులు రాధాకిషన్, సారంగం, సుతారి రాజు, కొమురవెల్లి లక్ష్మీనారాయణ, ప్రభాకర్, వెంకట్, రవిబాబు, కిరణ్, అశోక్ పాల్గొన్నారు.

నేడు రెండో విడుత రుణమాఫీ సమావేశం

ఖిలావరంగల్, జూలై 29 : వరంగల్ కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో మంగళవారం మధ్యాహ్నం 12 గంటలకు రెండో విడుత రుణమాఫీ సమావేశం ఉంటుందని డీఏవో ఉష ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 14,510 మంది రైతులకు గాను రూ.142.58 కోట్లు రుణమాఫీ జరుగనున్నట్లు తెలిపారు. ప్రజాప్రతినిధులు, ఎంపిక చేసిన రైతులు, సంబంధిత శాఖల అధికారులు సకాలంలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

2న శాకంబరీ అలంకరణలో శారదాదేవి

పోచమ్మమైదాన్, జూలై 29 : వరంగల్ శ్రీనివాస కాలనీలోని శ్రీ శృంగేరి శంకరమఠంలో ఆగస్టు 2న శ్రీశారదాదేవి అమ్మవారిని శాకంబరీగా అలంకరించనున్నట్లు ప్రధాన అర్చకుడు సంగమేశ్వర జోషి తెలిపారు. ఆషాఢమాసం నాలుగో శుక్రవారం సందర్భంగా అమ్మవారిని ఉదయం భక్తులు దర్శించుకోవాలని ఆయన సూచించారు. కాగా, శాకంబరీ అలంకరణ కోసం కూరగాయలు ఇచ్చే భక్తులు నగదును ఆలయంలో ఇచ్చిపేర్లను నమోదు చేసుకోవాలని కోరారు. వివరాలకు 99891 39461 నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

గంగదేవిపల్లిని సందర్శించిన కేంద్ర బృందం

బృందానికి స్వాగతం పలుకుతున్న తహసీల్దార్

గీసుగొండ, జూలై 29 : జాతీయ ఆదర్శ గ్రామం గంగదేవిపల్లిని సోమవారం కేంద్ర ప్రభుత్వ గ్రూప్ 1 అధికారుల బృందం సందర్శించింది. గ్రామంలోని ట్రైనింగ్ సెంటర్ జరిగిన సమావేశంలో గ్రామాభివృద్ధి, కమిటీల పనితీరును వారికి శిక్షణ మేనేజర్ కూసం రాజమౌళి వివరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రియాజుద్దీన్, ఏపీవో చంద్రకాంత్, ఆర్ఐ సాంబయ్య పాల్గొన్నారు. అలాగే, వర్ధన్నపేట, గీసుగొండ మండలాల్లో పనిచేస్తున్న వీఎస్‌జీ స్వచ్ఛంద సంస్థ సభ్యులు కూడా గంగదేవిపల్లి గ్రామాన్ని సందర్శించారు. సభ్యులు విజయ్‌కుమార్, నవీన్, పూర్ణిమ, మంజుల, రమ, సుజాత పాల్గొన్నారు.

పథకాలపై కేంద్ర బృందం అధ్యయనం

వర్ధన్నపేట, జూలై 29 : పేదల సంక్షేమం కోసం అమలవుతున్న పథకాలపై సెంట్రల్ అసిస్టెంట్ సెక్షన్ అధికారుల బృందం సోమవారం మండలంలోని ఇల్లంద గ్రామాన్ని సందర్శించింది. మర్రి చెన్నారెడ్డి మనవ వనరుల గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఐదుగురు అధికారుల బృందం ప్రతినిధులు నాలుగు రోజుల పాటు గ్రామంలో వివిధ పథకాలపై అధ్యయనం చేయనున్నారు. ఈ సందర్భంగా సోమవారం తొలిరోజు గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని సందర్శించి మండల స్థాయి అధికారులతో కలిసి సమీక్ష నిర్వహించారు. పంచాయతీ రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటరమణ, ఎంపీవో ధనలక్ష్మి, ఏపీవో నాగేశ్వర్‌రావు, ఏపీఎం వేణు, సీసీ కొమురయ్య పాల్గొన్నారు.

బీఎస్ఎన్ఎల్ ఉద్యోగుల బైక్ ర్యాలీ

ర్యాలీ నిర్వహిస్తున్న బీఎస్ఎన్ఎల్ ఉద్యోగులు

వరంగల్, జూలై 29 : వినియోగదారులను ఆకట్టుకునేందుకు బీఎస్ఎన్ఎస్ విస్తృత ప్రచారానికి శ్రీకారం చుట్టింది. సోమవారం బీఎస్ఎన్ఎల్ భవన్ నుంచి పోచమ్మమైదాన్ వరకు బీఎస్ఎన్ఎల్ ఉద్యోగులు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ జనరల్ మేనేజర్ విజయభాస్కర్ రెడ్డి మాట్లాడుతూ.. బీఎస్ఎన్ఎల్‌ను ప్రజలకు చేరువచేసేందుకు ర్యాలీ తీశామన్నారు. తక్కువ రేడియేషన్‌తో మెరుగైన నెట్‌వర్క్ బీఎస్ఎన్ఎల్ అని అన్నారు. త్వరలోనే 4జీ, 5జీ నెట్‌వర్క్‌ను అందుబాటులోకి తీసుకువస్తున్నామన్నారు. పేద, మధ్య తరగతి వినియోగదారులకు అందుబాటులో ఉండేలా ప్లాన్‌లు ఉన్నాయన్నారు.

కార్పొరేషన్ నోటీసులతో కార్మికుల ఆందోళన

- 13వ డివిజన్ వీవర్స్ కాలనీ నేతన్నల గుబులు
- మంత్రి కొండాకు విన్నపం

కార్పొరేషన్ జారీ చేసిన నోటీసును చూపిస్తున్న బాధితుడు

పోచమ్మమైదాన్, జూలై 29 : గ్రేటర్ పరిధిలోని 13వ డివిజన్ వీవర్స్ కాలనీ, ఉప్పు మల్లయ్య తోటవాసులకు అధికారులు నోటీసులు అందజేయడంతో ఆందోళన చెందుతున్నారు. మూడు దశాబ్దాల పైనుంచి చేనేత వృత్తిపై ఆధారపడి ఇక్కడే స్థిర నివాసం ఏర్పాటు చేసుకుని జీవనం కొనసాగిస్తున్న సమయంలో గుండెల మీద పిడుగులు పడ్డట్టుగా షోకాజ్ నోటీసులు జారీ చేయడంపై నిరుత్సాహం వ్యక్తం చేస్తున్నారు. నాటి సర్కార్ ఇచ్చిన జాగాలోనే పిల్లాపాపలతో ఉంటున్నామని, ఇప్పుడు ప్రభుత్వ స్థలాలు ఆక్రమించుకున్నారని, ఈ స్థలం ఎఫ్‌టీఎల్‌లో ఉందంటూ ఇండ్లు ఖాళీ చేయాలని నోటీసులు ఇవ్వడమేమిటని నేతన్నలు ప్రశ్నిస్తున్నారు. చేనేత, జౌళి శాఖ అధికారులే తమకు ఇళ్ల స్థలాలు, ఇంటి నిర్మాణాలు చేపట్టి ఇచ్చారని, ఆనాటి ప్రభుత్వ ఆదేశాల ప్రకారం నివాసం ఉంటున్నామని పేర్కొంటున్నా రు. వరంగల్‌లోని పలు ప్రాంతాలకు చెందిన చేనేత కార్మికుల కోసం 1992లో 130 మందికి ఇళ్ల పట్టాలు ఇచ్చి, కుడా లేఅవుట్ చేసి సర్వే నెంబర్ 308లో భూమి కేటాయించారు. ఈ భూమికి డీపీ నెంబర్ కూడా ఇచ్చారు. ఆనాటి చేనేత, జౌళిశాఖ అధికారులు ఏర్పాటు చేసిన వీవర్స్ కాలనీ, ఉప్పు మల్లయ్య తోట కాలనీలో చేనేత కార్మికులకు అన్ని వసతులు కల్పించారు. విద్యుత్, తాగునీటి సదుపాయం, రోడ్లు, ఇతర వసతులు ఏర్పాటు చేశారు. ఆనాటి నుంచి నేటి వరకు అందరం ఇంటి పన్ను, నీటి పన్ను చెల్లిస్తున్నామని వివరించారు. ఈ సమయంలో కార్పొరేషన్ అధికారులు షోకాజ్ నోటీసులు జారీ చేశారని ఆందోళన చెందుతున్నారు. ఈ విషయమై చేనేత సంఘం ప్రతినిధులు మంత్రి కొండా సురేఖను కలిసి వినతిపత్రం అందజేశారు. దీంతో ఆమె కలెక్టర్‌తో మాట్లాడి, సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చినట్లు సంఘం నాయకులు తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో సంఘం అధ్యక్షుడు యెలగం సాంబయ్య, డివిజన్ అధ్యక్షుడు బొట్ల ప్రసాద్, బండారి బాలరాజు, సామల రమేశ్, బండారి శ్రీను, మోత్కూరు సారంగం, సామల రాజశేఖర్ ఉన్నారు.

బదిలీపై వెళ్తున్న సిటీ ప్లానర్‌కు సన్మానం

వెంకన్నను సన్మానిస్తున్న నాయకులు

వరంగల్, జూలై 29 : బదిలీపై వెళ్తున్న బల్దియా సిటీ ప్లానర్ బానోత్ వెంకన్నను గ్రేటర్ వరంగల్ గోర్ బంజారా సంఘాలు సన్మానించి ఆత్మీయ వీడ్కోలు పలికాయి. హనుమకొండలోని జీఎస్ కన్వెన్షన్ హాల్‌లో గోర్ బంజారా సేవాలాల్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు బదావత్ బాలాజీ అధ్యక్షతన జరిగిన సమావేశంలో మాజీ ఎంపీ సీతారాం నాయక్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో డీసీపీ రాగ్యానాయక్, తహసీల్దార్ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఫూల్‌సింగ్ చౌహాన్, గోర్ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బానోత్ కిరణ్, సిక్వాడీ ఉమ్మడి జిల్లా కో ఆర్డినేటర్ కున్సోత్ హట్యానాయక్ పాల్గొన్నారు.

'నోట్లో బెల్లం, కంట్లో కారంగా కేంద్ర బడ్జెట్'

వరంగల్ చౌరస్తా, జూలై 29 : కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రజలకు నోట్లో బెల్లం పెట్టి, కంట్లో కారంకొట్టిన విధంగా ఉందని ఎంసీపీఐ (యూ) పొలిట్ బ్యూరో సభ్యుడు వల్లెపు ఉపేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం ఓంకార్ భవన్‌లో నిర్వహించిన పార్టీ హనుమకొండ జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశ ప్రజల ప్రయోజనాల కంటే కార్పొరేట్ శక్తుల ప్రయోజనాలకే ప్రాధాన్యం కల్పించారన్నారు. వ్యవసాయ, విద్యా రంగాలకు నిధులు పెంచాలన్నారు. ఆర్ఎస్ఎస్‌లో ప్రభుత్వ ఉద్యోగులు చేరవచ్చని జారీ చేసిన జీవోను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణకు కేంద్రం తీవ్ర అన్యాయం చేసిందన్నారు. బయ్యారం ఉక్కు కర్మాగారం, కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ, పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టులకు నిధులు కేటాయించపోవడంతో పాటు జాతీయ రహదారుల విషయంలో సైతం తీవ్ర అన్యాయం చేసిందన్నారు. కార్యక్రమంలో కేంద్ర కమిటీ సభ్యులు గోనె కుమారస్వామి, జిల్లా కమిటీ సభ్యులు హంసారెడ్డి, నీల రవీందర్, సావిత్రి, రాజిరెడ్డి, మొగిలి శ్రీనివాస్, ఇంద్రారెడ్డి, ఉస్మాన్, బుచ్చయ్య పాల్గొన్నారు.

'కూలీ భరోసా పథకం ప్రవేశపెట్టాలి'

ఖిలావరంగల్, జూలై 29 : కేంద్ర బడ్జెట్‌లో వ్యవసాయ కార్మికులకు నిధులు పెంచి, కూలీ భరోసా పథకం ప్రవేశపెట్టాలని బీకేఎంయూ జాతీయ కార్యవర్గ సభ్యుడు వెంకట్రాములు అన్నారు. సోమవారం శివనగర్‌లోని తమ్మెరభవనంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధి హామీ పనులకు రూ.2.70వేల కోట్లు కేటాయించాలన్నారు. వ్యవసాయ కార్మిక సమగ్ర సంక్షేమ చట్టం రూపొందించి, అమలు చేయాలన్నారు. వచ్చే నెల 3, 4 తేదీల్లో వేములవాడలో జరుగనున్న రాష్ట్ర స్థాయి శిక్షణ శిబిరాలను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో బీకేఎంయూ జిల్లా ఉపాధ్యక్షురాలు హంస మంజుల, నాయకులు మోతె లింగారెడ్డి, సిలువేరి విజయ, రమేశ్, పిట్టల సతీశ్, జాన్‌పాల్, కే భాగ్య, సారయ్య, అశోక్, సారమ్మ పాల్గొన్నారు.

తాటి వనాలను అభివృద్ధి చేయాలి

మొక్క నాటుతున్న ఎక్సైజ్ సీఐ నరేశ్‌రెడ్డి

చెన్నారావుపేట, జూలై 29 : గీత కార్మికులు తాటి వనాలను పెంచి ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని ఎక్సైజ్ సీఐ నరేశ్ రెడ్డి అన్నారు. సోమవారం వన మహోత్సవంలో భాగంగా చెన్నారావుపేట మండలంలోని పాపయ్యపేటలో ఎక్సైజ్ అధికారులు తాటి, ఈత మొక్కలను నాటారు. ఈ సందర్భంగా గీత కార్మికులకు సలు సూచనలు సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో గౌడ సంఘం అధ్యక్షుడు కత్తి స్వామి, మేడి సుధాకర్, మాజీ అధ్యక్షులు బండి రమేశ్, బుర్ర సుదర్శన్‌గౌడ్, బుచ్చి రాములు, రామగోని రవి, యాదగిరి గౌడ్, నర్సయ్య, నారాయణ, ఎక్సైజ్ కానిస్టేబుల్ లింగేశ్వర్, రామ్మూర్తి, సుధీర్, నాగరాజు, వినోద్ పాల్గొన్నారు.

కార్గో సేవలను సద్వినియోగం చేసుకోవాలి

కార్గో సెంటర్‌ను ప్రారంభిస్తున్న నరేందర్

ఖానాపురం, జూలై 29 : టీజీఎస్ ఆర్టీసీ కార్గో సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నర్సంపేట డిపో లాజిస్టిక్ సేల్స్ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ నరేందర్ అన్నారు. బుధరావుపేటలోని మసీదు కాంప్లెక్స్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన టీజీఎస్ఆర్టీసీ లాజిస్టిక్ కార్గో పాయింట్‌ను ఆయన సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నరేందర్ మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలతో పాటు ఏపీ, మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాలకు సరసమైన ధరలకే పార్సిల్ పంపనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సేల్స్ టీం లీడర్ రామయ్య, బుధరావుపేట కౌంటర్ ఏజెంట్ సలీం, ఎస్కే జానీ, లాల్‌పాషా, లింగిడి వెంకటేశ్వర్లు, బత్తిని శ్రీనివాస్, ఎల్లగౌడ్, నందగిరి రజిని పాల్గొన్నారు.

సాగు నీటి కోసం డబ్బులు వసూలు

చెన్నారావుపేట, జూలై 29 : చెన్నారావుపేటలోని కోపాకుల చెరువు ఆయకట్టు రైతుల నుంచి కొంత మంది అక్రమంగా డబ్బులు వసూళ్లకు పాల్పడుతున్నారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెరువు ఆయకట్టు పారకంతో పాటు శివారులో ప్రవహిస్తున్న పాకాల వాగు నుంచి లిఫ్ట్ ద్వారా నీటిని పొలాలకు మళ్లించి, సేద్యం చేస్తారు. అయితే, లిఫ్ట్ రిపేరు ఉందని, మెయింటనెన్స్ కోసమని రైతుల నుంచి ఏటా కొందరు చోటా నాయకులు రూ.లక్షల్లో వసూలు చేస్తున్నారు. ఇంతకు ముందు వసూలు చేసిన డబ్బులకు లెక్కలు కూ డా చెప్పడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు లిఫ్ట్ పనిచేయక పోతే ప్రభుత్వం నుంచి నిధులు తెచ్చి రిపేరు చేయించాలి కానీ, ఇలా రైతుల నుంచి వసూలు చేయడం ఏంటని ప్రశ్నిస్తున్నారు. ఎవరైనా బలవంతంగా వసూళ్లకు పాల్పడితే పోలీసులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరిస్తున్నారు.

కోటలో సైబర్ నేరాలపై అవగాహన

ఖిలావరంగల్, జూలై 29 : సైబర్ నేరాల బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలని మిల్స్‌కాలనీ సీఐ పీ మల్లయ్య ఖిలావరంగల్ పడమరకోటలో అవగాహన కల్పించారు. గుర్తు తెలియని వ్యక్తులు పంపించే మెసేజ్‌లకు స్పందించద్దని సూచించారు. సైబర్ క్రైం బారిన పడితే 1930లో సంప్రదించాలని తెలిపారు.

సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

నర్సంపేట రూరల్, జూలై 29 : మండలంలోని లక్నెపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 2006–07 విద్యాసంవత్సరం పదో తరగతి పూర్తి చేసిన పూర్వ విద్యార్థులు సోమవారం ఒకే చోట కలుసుకున్నారు. 17 ఏళ్ల తర్వాత కలిసిన వారు నాటి జ్ఞాపకాలను, తీపి గుర్తులను ఒకరికి ఒకరు పంచుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులైన రవికుమార్, కృష్ణమాచార్యులు, దేవేందర్, సాంబమూర్తి, ఆశ్లేష, రమేశ్‌ను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ఉమామహేశ్వర్, సురేశ్, రాజు, సతీశ్, శివ, భిక్షపతి, శ్రీవాణి, స్రవంతి, మమత, రజిత పాల్గొన్నారు.